ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
24-09-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 23 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి




## కేంద్ర ప్రభుత్వం ఎంట్రీతో మైండ్ బ్లాక్
# షోకాజ్ నోటీసులు

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం కల్తీపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ చాలా సీరియస్ అయ్యింది. తిరుమల లడ్డూల తయారి కోసం సరఫరా చేసే నెయ్యి తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించని తమిళనాడుకు చెందిన ఏఆర్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# కావూరి హిల్స్‌లో హైడ్రా కూల్చివేతలు



**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

మాదాపూర్‌లోని కావూరి హిల్స్ లో అక్రమ నిర్మాణా ల కూల్చివేతలు ఈరోజు ఉదయం నుంచి కొనసాగుతున్నాయి. మాదాపూర్ లోని కావేరి హిల్స్ పార్కు స్థలంలో వెలిసిన అక్రమ షెడ్లను తొలగిస్తున్నారు. హైడ్రా అధికారులు. గతంలో కావూరి హిల్స్ పార్కు స్థలంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశారు. పార్కులో స్పోర్ట్స్ అకాడ మీపై కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. కావూరి హిల్స్ అసోసియే షన్ ఫిర్యాదుతో అక్రమ షెడ్లను కూల్చి వేశారు. అక్రమ నిర్మాణాలు తొలగించి కావూరి హిల్స్ పార్కు పేరిట బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. పార్కు స్థలాన్ని 25 ఏళ్లు లీజుకు తీసుకున్నామని స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. గడువు తీరకముందే అన్యాయంగా నిర్మాణాలు తొలగించారని ఆరోపణలు చేశారు. కావురి హిల్స్‌లోని అక్రమ నిర్మాణాల కూల్చి వేతపై హైడ్రా కమిషనర్ స్పందించారు. కోర్టు ఆదేశాలతోనే కావూరి హిల్స్‌లోని అకాడమీని కూల్చివేశామని హైడ్రా అధికారి రంగనాథ్ తెలిపారు.

# ఒక రాష్ట్రం.. ఒక కార్డు
## తెలంగాణ కొత్త ప్రయోగం.. రేషన్, హెల్త్ రెండూ ఒకటే




**'ఒక రాష్ట్రం.. ఒక కార్డు' తెలంగాణ కొత్త ప్రయోగం.. రేషన్, హెల్త్ రెండూ ఒకటే తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీపై మీనమేషాలు వేస్తోంది.**

**జయభేరి, హైదరాబాద్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తాం ఇస్తామంటూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చెబుతోంది. తాజాగా ఇప్పుడు సరికొత్త మెలిక పెట్టినట్లు తెలుస్తోంది. రేషన్ కార్డుల స్థానంలో కుటుంబ కార్డులు జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అదే కార్డులో కుటుంబ హెల్త్ ప్రొఫైల్ కూడా పొందుపరచనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు త్వరలోనే కొన్ని చోట్ల ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఇవ్వాలనే యోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ప్రతీ నియోజకవర్గంలో ఒక అర్బన్, ఒక

...మిగతాది 2 లో



# ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా పని చేస్తా..

**ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఇటీవలే ప్రమాణ స్వీకారం చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిశీ ఇవాళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ బాధ్యతలు చేపట్టిన అత్యంత పిన్న వయస్కు రాలిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా ఆమె రామాయణంలో రాముడి కోసం భరతుడు చేసినట్లు తాను ఆపద్ధర్మ ముఖ్య మంత్రిగా పనిచేస్తానని వ్యాఖ్యానించారు. తన పక్కన ఓ ఖాళీ కుర్చీని ఉంచారు. ఆ కుర్చీలో సీఎంగా కేజ్రీవాల్ మళ్లీ కూర్చుకుంటారన్న సంకేతాలు ఇచ్చారు.**

ఢిల్లీ సీఎం అతీషి

**జయభేరి, న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 23 :**

రామాయణంలో రాముడి పాదరక్షలు సింహాసనంపై ఉంచి భరతుడు రాజ్యాన్ని 14 ఏళ్ల పాటు పాలించిన విషయం తెలిసిందే. ఓ కుర్చీని అతిశీ చూపిస్తూ ఇది ముఖ్యమంత్రి సీటని, కేజ్రీవాల్ మళ్లీ సీఎం అయ్యే వరకు ఇది ఖాళీగా ఉంటుందని అన్నారు. దీంతో ఆమెపై బీజేపీ తీవ్ర విమర్శలు చేస్తోంది.
కేజ్రీవాల్ రిమోట్ కంట్రోల్ ప్రభుత్వాన్ని నడుపుతారా?అని ప్రశ్నించింది. కుర్చీలో ఆమెను కూర్చోబెట్టి మిగతా వ్యవహారాలంతా కేజ్రీవాలే చూసుకుంటారని విమర్శించింది. కాగా, ఇటీవలే నిరాడం బరంగా రాజ్ భవన్ లో ఢిల్లీ ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకారం జరిగింది. ఢిల్లీ ముఖ్య మంత్రిగా అతిశీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎల్జీ వినయ్ కుమార్ సక్సేనా. ఢిల్లీ 8వ ముఖ్యమంత్రిగా అతిశీ నిలిచారు. మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గెహ్లాట్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, ముకేశ్ అహ్లావత్ ప్రమాణ స్వీకారం చేశారు. సెప్టెంబర్ 2627 తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీలో అతిశీ బలనిరూపణ చేసుకోనున్నారు.



# ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

- కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది BRS ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

**జయభేరి, హైదరాబాద్:**

2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల్), కడియం శ్రీహరి (ఘన్‌పూర్), తెల్లం వెంకట్‌రావు (భద్రాద్రి కొత్తగూడెం), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), కాలె యాదయ్య (చేవెళ్ల) , టి ప్రకాష్ గౌడ్ (రాజేంద్ర నగర్), ఎం సంజయ్ కుమార్ (జగిత్యాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్చెరు) అరెకపూడి గాంధీ (సెరిలింగంపల్లి). సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ శ్రీనివాస్‌లతో కూడిన హైకోర్టు డివిజన్ బెంచ్ స్పీకర్, తెలంగాణ రాష్ట్ర శాసనసభ కార్యదర్శి, భారత ఎన్నికల సంఘం కార్యదర్శి, న్యూఢిల్లీకి కూడా నోటీసులు జారీ చేస్తూ అక్టోబరు 4లోగా నోటీసులకు సమాధానమివ్వాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా.. పిటిషనర్, ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కిలారి ఆనంద్ పాల్, మొత్తం 10మంది BRS ఎమ్మెల్యేలు 'తదుపరి అసెంబ్లీ కార్యక్రమాలలో పాల్గొనకూడదని పేర్కొన్నారు. వారి అధికారాన్ని ఉపయోగించకూడదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును అభ్యర్థించారు. ఓటు హక్కు అటువంటి చర్య రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లో ప్రకటించబడిన నిబంధనలను ఉల్లంఘించినట్లు అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయా..? అనే విషయాన్ని పిటిషనర్ కోర్టుకు తెలియజేయలేనందున అటువంటి అభ్యర్థనను డివిజన్ బెంచ్ తిరస్కరించింది.




# సీఎం రేవంత్ కు చెక్కు అందించిన మహేష్

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

ఇటీవల తెలుగు రాష్ట్రాలలో వరద బాధితు లను ఆదుకునేందుకు సూపర్ స్టార్ మహేష్ బాబు ముందుకొచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే ఏపీ తెలంగాణ రాష్ట్రాలకు 50 లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు.
ఈ నేపథ్యంలో సినీ హీరో మహేష్ బాబు తన భార్య నమ్రతతో కలిసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎం రేవంత్ రెడ్డికి మహేష్ బాబు వరద బాధితుల సాయం కోసం 50 లక్షల రూపాయల చెక్కుని అందించారు. అలాగే AMB సినిమాస్ తరపున మరో 10 లక్షలు కూడా అందచేశారు. సీఎం రేవంత్ మహేష్ కి ధన్యవా దాలు తెలిపి శాలువా వేసి సత్కరించారు.

# మరో రెండ్రోజుల్లో వారి ఖాతాల్లో రూ.10వేలు..



**జయభేరి, ఖమ్మం:**

తెలంగాణ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి ప్రజలు, రైతులు నష్టపోయారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బాధితులను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారని మంత్రి చెప్పారు. అన్నదాతల బాధలు చూసి వారిని ఆదుకునేందుకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ మేరకు మరో రెండ్రోజుల్లో రైతన్నలకు డబ్బులు అందజేయనున్నట్లు పొంగులేటి వెల్లడించారు. నేలకొండపల్లి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

...మిగతాది 2 లో



# కర్నూలులో హైకోర్టు బెంచ్, అమరావతిలో లీగల్ కాలేజ్
## మైనారిటీ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
## సుహాసినికి చంద్రబాబు కీలక పదవి..?

**జయభేరి, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ శాఖపై సమీక్ష నిర్వహించిన చంద్రబాబు... కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు కేంద్రానికి పంపుతామని చెప్పారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి పంపుతామని సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. 100 ఎకరాల్లో అమరావతిలో లీగల్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కేంద్ర ప్రభుత్వం ఎంట్రీతో మైండ్ బ్లాక్.. షోకాజ్ నోటీసులు

తమిళనాడుకు చెందిన ఏఆర్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంతో ఇప్పుడు ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది. తిరుమల లడ్డూ ప్రసాదం వివాదం నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో శ్రీవెంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీకి నెయ్యి సరఫరా చేసే నాలుగు కంపెనీలకు చెందిన నెయ్యి నమూనాలను కేంద్ర ప్రభుత్వం సేకరించింది. ఈ మేరకు ఆ నెయ్యి నాణ్యతపై పరీక్షలు నిర్వహించింది. వాటిలో తిరుమలకు నెయ్యి పరఫరా చేసిన మూడు కంపెనీలు సరైన ప్రమాణాలు పాటించినట్లు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ గుర్తించింది. అయితే తమిళనాడుకు చెందిన ఏఆర్ కంపెనీ మాత్రం నెయ్యి నాణ్యతా పరీక్షల్లో ఫెయిల్ అయ్యిందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ మేరకు సరైన ప్రమాణాలు పాటించకుండా కల్తీ నెయ్యి తిరుమల శ్రీవారి లడ్డూలు తయారు చెయ్యడానికి సరఫరా చేస్తున్న ఆ కంపెనీకి ఫుడ్ స్టాండర్డ్స్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ విషయంపై ఏఆర్ కంపెనీ యాజమాన్యం ఎలా స్పందిస్తుంది, ఏం చెబుతుంది అంటూ కోట్లాది మంది శ్రీవారి భక్తులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడిన వైసీపీ నాయకులు తిరుమలకు నెయ్యి సరఫరా చెయ్యడానికి కాంట్రాక్టులు ఇచ్చారని కూటమి ప్రభుత్వంలోని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు. అప్పటి టీటీడీ బోర్డుకు చెందిన కొందరు నెయ్యి కాంట్రాక్టులతో కుమ్మక్కు అయ్యారని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు ప్రజలు కూడా ఆరోపిస్తున్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుని నెయ్యి నమూనాలు సేకరించి వాటిని పరీక్షించి ఏఆర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది.

## ఒక రాష్ట్రం.. ఒక కార్డు

గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకుని పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సోమవారం వైద్యారోగ్య శాఖపై జరిగిన సమీక్షలో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. పైలట్ ప్రాజెక్టుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. రేషన్, హెల్త్ ప్రొఫైల్‌తో పాటు సంక్షేమ పథకాలన్నిటికీ ఇకపై ఒకే కార్డు కింద ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. 'వన్ స్టేట్.. వన్ డిజిటల్ కార్డ్' విధానంతో ప్రభుత్వం ముందుకెళ్లాలనే యోచిస్తోంది. ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో ఎక్కడైనా సంక్షేమ పథకాలను పొందేలా చర్యలు తీసుకుంటుందని సమాచారం. ఫ్యామిలీ డిజిటల్ కార్డుతోనే కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య సేవలు అందించాలని సమావేశంలో చర్చించారు. ప్రతీ ఒక్కరి హెల్త్ పొఫైల్ ఉండాలన్న సీఎం ఆదేశించారు. అర్హులందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. 'ఫ్యామిలీ డిజిటల్ కార్డుల మానిటరింగ్‌కు జిల్లాలవారీగా ఒక వ్యవస్థ ఉండాలి. రాజస్థాన్, హర్యానా, కర్ణాటకలాంటి ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలి' అని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మరికొన్ని వైద్యారోగ్య శాఖ కార్యక్రమాలపై సీఎం, మంత్రులు చర్చలు చేశారని సమాచారం. కాగా హెల్త్ కార్డు ప్రొఫైల్ కార్యక్రమం అనేది నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఇది అధ్యయనం చేయాలని నాడు అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే కార్యక్రమాన్ని రేవంత్ సర్కార్ అమలు చేస్తుండడం విశేషం.

## మరో రెండ్రోజుల్లో వారి ఖాతాల్లో రూ.10వేలు..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.."భారీ వర్షాల వల్ల తెలంగాణ ప్రజలు నష్టపోయారు. ముఖ్యంగా రైతులు బాగా దెబ్బతిన్నారు. కేంద్ర బృందం వచ్చి పరిశీలించినా.. ఇంతవరకూ ఒక్క రూపాయి రాలేదు. మునిగిన పంట పొలాలకు ఎకరానికి పది వేలు ఇస్తామని చెప్పాం. రెండ్రోజుల్లో రైతులకు పంట పరిహారం కింద మొదటి విడతగా రూ.10వేలు ఇస్తాం. సాగర్ కాలువ నాలుగు చోట్ల తెగింది. పాలేరు దిగువన ఉన్న రైతులందరికీ రేపటి కల్లా నీటిని అందిస్తాం. కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వ పెద్దలు లక్షల కోట్లు దోచుకున్నారు. గతంలో పంట నష్టం జరిగితే మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిహారం ఇచ్చాం. రైతుల పట్ల BRS ప్రభుత్వం కపట ప్రేమ చూపించింది. రుణమాఫీ రూ.14వేల కోట్లు ఉంటే ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8వేల కోట్లు మాత్రమే మాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు వారికి లేదు. అమృత్ పథకంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. సృజన్ రెడ్డికి రూ.8.888కోట్ల టెండర్లు ఇచ్చినట్లు కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఆయన చేసిన ఆరోపణలు అబద్ధమని నిరూపిస్తానని చెప్పా. ఎప్పుడు, ఎక్కడికి రావాలో చెప్పమని, రుజువు చేస్తే రాజీనామా చేస్తానని కేటీఆర్‌కు సవాల్ చేశా. దానిపై ఇంతవరకూ సమాధానం లేదు. సిట్టింగ్ జడ్జి దగ్గరకు వెళ్లి మాట్లాడదామా?. అనుభవం ఉందని చెప్పుకునే మీరు ఎవరో చెపితే నింద మోపే ముందు ఆలోచించాలి. ఒక్క రూపాయి అవినీతి జరిగినా జరిగినట్లేనని కేటీఆర్ అంటున్నారు. మీ పార్టీ నుంచి పాలేరులో నా మీద పోటీ చేసిన ఉపేందర్ రెడ్డి అల్లుడు సృజన్ రెడ్డి. సృజన్ రెడ్డికి మీ ప్రభుత్వంలో సబ్ కాంట్రాక్టు ఇప్పించారు. అలాంటి సృజన్ రెడ్డిని రేవంత్ రెడ్డి బావమరిదిగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. నిరంతరం ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కూలగొట్టాలని బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారు. తెల్లరేషన్ కార్డులు ఇచ్చామని చెప్పేది అబద్ధం. వచ్చే నెల రెండో తారీకు నుంచి స్మార్ట్ కార్డులు ఇవ్వబోతున్నాం. ప్రతీ నియోజకవర్గంలో 3,500కార్డులు ఇస్తాం. సంక్రాంతి లోపే స్మార్ట్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం ఇస్తాం. ఈ ఖరీఫ్ పంట నుంచే సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తాం. ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తుంటే ప్రతిపక్షం ఓర్వలేక నిందలు వేస్తోంది" అని మండిపడ్డారు.

## కర్నూలులో హైకోర్టు బెంచ్, అమరావతిలో లీగల్ కాలేజ్

ఇంటర్నేషన్ లా స్కూల్ ఏర్పాటును ముందుకు తీసుకువెళ్లాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. నిందితులకు శిక్ష పడేలా ప్రాసిక్యూషన్ ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. బెంగుళూరుకు చెందిన నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, గోవాలోని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థల తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యుత్తమ ఇనిస్టిట్యూట్‌ను అమరావతిలో ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు గౌరవ వేతనం కింద రూ.10 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.
మైనారిటీ సంక్షేమ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్ భవన్ ను పూర్తి చేయాలని అధికారులను సీఎం అదేశించారు. ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్‌లకు రూ. 5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. మైనార్టీలకు లబ్ధి జరిగేలా వక్ఫ్ భూములను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా మైనార్టీ సంక్షేమ పథకాల పునర్వ్యవస్థీకరణపై చర్చించారు. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద మంజూరైన రూ.447 కోట్ల కు సంబంధించి పెండింగులో ఉన్న పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరై కొంత మేర నిర్మాణాలు జరిగిన షాదీఖానాలు, ఇతర నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ప్రారంభంకాని పనులను రద్దు చేసి పునః సమీక్ష చేయనున్నామని సీఎం తెలిపారు. వక్ఫ్ బోర్డు భూముల సర్వే రెండేళ్లలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు వ్యూహారచన చేస్తున్నారు. ఈ క్రమంలోనే నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసినికి టీడీపీ తెలంగాణ అధ్యక్షురాలి పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆమెను రాజ్యసభకు పంపిస్తారని చర్చ జరుగుతోంది. సుహాసినికి రాజ్యసభ సీటు ఇవ్వడంతో నందమూరి కుటుంబానికి ప్రాధాన్యత, తెలంగాణలో పార్టీ భవిష్యత్‌కు మేలు చేస్తుందని చంద్రబాబు భావిస్తున్నారు.

# అనర్హులు స్వచ్ఛంధంగా పెన్షన్లు వదులుకోండి

▶▶ పెన్షన్లపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు, ప్రక్షాళన తప్పదని ప్రకటన

**జయభేరి, అమరావతి :**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక పెన్షన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో పెద్ద ఎత్తున అనర్హులకు సామాజిక పెన్షన్లు అందిస్తున్న నేపథ్యంలో అనర్హులు స్వచ్ఛంధంగా తమ పెన్షన్లను వదులుకోవాలని బాబు సూచించారు. ఏపీ ప్రభుత్వం అందించే సామాజిక పెన్షన్ల ప్రక్షాళనకు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో 64 లక్షలమందికి పైగా పెన్షన్లకు ప్రభుత్వం ప్రతి నెల దాదాపు రూ.2800కోట్ల రుపాయల్ని పెన్షన్ల రూపంలో చెల్లిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అనర్హులకు పెన్షన్లు అందుతున్నట్టు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గుర్తించింది. అక్రమంగా పెన్షన్లు అందుకుంటున్న వారంతా స్వచ్ఛంధంగా పెన్షన్లు వదులుకోవాలని సిఎం చంద్రబాబు సూచించారు. గత కొన్నేళ్లుగా ఏపీ అందించే సామాజిక పెన్షన్ మొత్తం పెరగడంతో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. వైసీపీ హయంలో పెన్షన్ అర్హత వయసు నిర్ధారణ కోసం ఆధార్ కార్డుల్లో వయసు మార్చుకుని కూడా అక్రమాలకు పాల్పడ్డారు. దీనిని అరికట్టాలని ప్రయత్నించినా రాజకీయ కారణాలతో వాటిని చేయలేకపోయారు. 64లక్షల మంది పెన్షనర్లలో అసలైన అర్హులు ఎందరో క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలనకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. మరోవైపు విభిన్న ప్రతిభావంతుల విషయంలో ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దివ్యాంగులను ప్రత్యేకంగా చూడాల్సిన అవసరముందన్న కారణంతో అధికారం చేపట్టిన తొలి నెలలోనే పింఛన్ రూ. 3వేల నుంచి ఒకేసారి రూ.6 వేలకు పెంచామని, దీర్ఘకాలిక ఆనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారికి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.15 వేలు ప్రతినెలా పింఛను రూపంలో ఇస్తున్నామని తెలిపారు.
అర్హులైన ఏ ఒక్కరికీ పింఛన్ అందకుండా ఉండటానికి వీల్లేదని, ముఖ్యంగా దివ్యాంగుల విషయంలో ప్రతి ఒక్క అర్హుడికి పింఛన్ ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో తప్పుడు సర్టిఫికేట్లతో దివ్యాంగుల కోటాలో పింఛన్ పొందిన ఘటనలు ఉన్నాయని.... ఈ విషయంలో పెద్దఎత్తున ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ అంశం తన దృష్టికి కూడా వచ్చిందన్న సిఎం.... అర్హులకు, బాధితులకు పింఛన్ ఇవ్వాలన్నది తమ విధానమని.... దాన్ని దుర్వినియోగం చేసి పింఛన్లు పొందడం సరికాదని అన్నారు.
వైద్యుల నుంచి తప్పుడు సర్టిఫికెట్లతో కొంత మంది దివ్యాంగుల పేరుతో పింఛన్లు తీసుకోవడాన్ని అరికట్టాలని ఆదేశించారు. అనర్హులు ఎవరైనా తప్పుడు పద్దతిలో పింఛన్‌లు పొందుతుంటే స్వచ్ఛందంగా వదులుకోవాలని సీఎం స్పష్టం చేశారు. పింఛన్ల అంశంలో ప్రత్యేకంగా గ్రామ సభలు పెట్టి అర్హులకు పింఛన్లు ఇవ్వడంతో పాటు...అనర్హులను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అనర్హులు దివ్యాంగుల పేరుతో పింఛను పొందడం అంటే అర్హులకు అన్యాయం చేయడమే అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిజమైన లబ్ధిదారులకు సాయం చేసే విషయంలో రాజీపడబోదని...ఇదే సమయంలో బోగస్ పింఛన్లు కూడా కొనసాగించేది లేదని సీఎం అన్నారు.

**సీనియర్స్ సిటిజన్స్ కు డిజిటల్ లిట్రసీ**

గ్రామాల్లో ఉండే వృద్ధులకు పింఛన్ ఇవ్వడంతో పాటు.... వారికి ఇతరత్రా ఏం చెయ్యవచ్చనేది కూడా స్టడీ చేయాలని సీఎం అధికారులకు సూచించారు. గ్రామాల్లో వృద్ధులకు డిజిటల్ లిట్రసీ ద్వారా వారు సులభంగా సేవలు పొందే అవకాశాన్ని కల్పించాలన్నారు. దీని కోసం వృద్ధులు, ఆయా ఏజెన్సీలతో మాట్లాడి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 39 లక్షల మంది సీనియర్ సిటిజన్స్ కు పింఛన్లు ఇస్తున్నామని...వారికి గ్రామాల్లో అవకాశాలు సృష్టించే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పింఛన్లతో సోషల్ సెక్యూరిటీతో పాటు గౌరవం ఇచ్చామన్నారు. వృద్ధులకు పింఛన్ ఇచ్చి వదిలేయడం కాకుండా వారి జీవన ప్రమాణాలను ఎలా పెంచవచ్చనే విషయంలో ఆలోచనలు చేసి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దివ్యాంగుల కోసం స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటుకు విశాఖలో 30 ఎకరాలు కేటాయించాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.200 కోట్లతో ఈ సెంటర్ మంజూరు చేసిందని...అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు జరగలేదని, ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని సీఎం అన్నారు. సింగిల్ గా ఉండే ట్రాన్స్ జెండర్స్‌కు రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. పిల్లల్లో చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలు కనిపెట్టేందుకు పరీక్షలు చేయాలని....ఇలాంటి కార్యక్రమం సమర్థవంతంగా చేపడితే వారు భవిష్యత్ లో దివ్యాంగులు అవ్వకుండా అరికట్టవచ్చని సూచించారు. దీని కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. దివ్యాంగులకు ఇచ్చే వీల్ చైర్స్, ట్రై సైకిల్స్ సోలార్ సిస్టంతో నడిచే విధంగా రూపొందించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

# లెబనాన్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. 356 మందికి పైగా మృతి


▶▶ లెబనాన్‌పై ఇజ్రాయెల్ భారీ వైమానిక దాడులు జరిపింది. హిజ్బొల్లా గ్రూప్ స్థావరాలే లక్ష్యంగా జరిపిన ఈ దాడుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో 24 మంది చిన్నారులు కూడా ఉన్నారు. చాలా మంది గాయాలపాలయ్యారు.



బెకా లోయలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు
బెకా లోయలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు
ఇజ్రాయెల్ సోమవారం దక్షిణ, తూర్పు లెబనాన్‌లో వందలాది వైమానిక దాడులను ప్రారంభించింది. 24 మంది పిల్లలు, 42 మంది మహిళలతో సహా 356 మందికి పైగా మరణించారు. హిజ్బుల్లా మిలిటెంట్ గ్రూప్ ఆయుధాలు నిల్వ ఉంచిందని కొన్ని ప్రదేశాలను ఇజ్రాయెల్ మిలటరీ పేర్కొంది. ఆ ప్రదేశాలను ఖాళీ చేయాలని నివాసితులకు సూచించింది. చాలా ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది.
దక్షిణ లెబనాన్‌లోని వివిధ గ్రామాల నివాసితులు తమ పట్టణాలను వైమానిక దాడులు తాకినట్లుగా సోషల్ మీడియాలో ఫోటోలను పోస్ట్ చేశారు. హిజ్బుల్లా ఉత్తర ఇజ్రాయెల్‌లోకి 100కి పైగా రాకెట్‌లను ప్రయోగించిన ఒక రోజు తర్వాత ఈ ఘటన జరిగిందని చెబుతున్నారు. మరోవైపు సోమవారం ఉదయం నుంచే ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టిందని లెబనాన్ ప్రకటించింది. దాడలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని ఐరాసతోపాటు ఇతర దేశాలను కోరింది. మజ్జాల్ సేలం, హులా, తౌరా, క్లయిలే, హారిస్, నబీ చిట్, హర్బాటాతోపాటు పలు ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగాయి. మరణించిన వారిలో పిల్లలు, మహిళలు, పారామెడికల్ సిబ్బంది ఉన్నారని లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. దక్షిణ ప్రాంతంలో హిజ్బుల్లా ఆయుధాలు నిల్వచేసిన ప్రాంతాలను ప్రజలు వెంటనే వీడాలని ఇజ్రాయెల్ పేర్కొంది. బేకా లోయ ప్రాంతాంలో భారీగా దాడులు చేసింది. దానికి ముందు హెచ్చరిక జారీ చేసింది. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చాలా మంది ప్రజలు అక్కడి నుంచి పారిపోయారు. లెబనాన్ రాజధాని బీరూట్‌లోనూ దాడులు చేపట్టినట్టుగా ఇజ్రాయెల్ తెలిపింది. ఈ ఉద్రిక్తల నేపథ్యంలో 40వేల మంది సైనికులను పశ్చిమాసియాలో మోహరించింది అమెరికా. మరింత మందిని పంపేందుకు సిద్ధమైంది. మరోవైపు ఈ విషయంపై ఐరాస స్పందించింది. కాల్పుల విరమణపై ఇరుపక్షాలు ఆసక్తిగా లేరని స్పష్టమవుతుందని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. గత వారం ప్రధానంగా హిజ్బుల్లా సభ్యులు ఉపయోగించే వేలాది సమాచార పరికరాలు లెబనాన్‌లోని వివిధ ప్రాంతాల్లో పేలి 39 మంది మరణించారు. దాదాపు 3,000 మంది గాయపడ్డారు.

# అన్‌మోల్ అంబానీకి సెబీ రూ. 1 కోటి జరిమానా

**జయభేరి, న్యూఢిల్లీ:**



రిలయన్స్ హోమ్ ఫైనాన్స్‌కి సంబంధించి కార్పొరేట్ రుణాలకు ఆమోదం తెలిపే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమైనందుకు గాను పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కుమారుడు అన్‌మోల్ అంబానీకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రూ. 1 కోటి జరిమానా విధించింది.
అలాగే రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్ చీఫ్ రిస్క్ ఆఫీసర్ కృష్ణన్ గోపాలకృష్ణన్‌కి రూ. 15 లక్షల ఫైన్ విధించింది.
45 రోజుల్లోగా ఇద్దరూ ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధుల మళ్లింపు కేసులో అనిల్ అంబానీతో పాటు మరో 24 మంది సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా సెబీ ఆగస్టులో నిషేధం విధించింది. తాజాగా సోమవారం ఇచ్చిన ఆదేశాల ప్రకారం, జనరల్ పర్పస్ కార్పొరేట్ రణాలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దంటూ కంపెనీ డైరెక్టర్ల బోర్డు నుంచి స్పష్టమైన సూచనలు ఉన్నప్పటికీ బోర్డు సభ్యుడైన అన్‌మోల్ అంబానీ వాటిని పట్టించుకోకుండా ఎక్యురా ప్రొడక్షన్స్ అనే సంస్థకు రూ. 20 కోట్ల లోన్‌కి ఆమోదముద్ర వేశారని ఆరోపణలు ఉన్నాయి.



# హైదరాబాద్ ప్రజలకు అలర్ట్..

▶▶ ఈ రాత్రికి పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ వర్షాలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదే సమయంలో.. హైదరాబాద్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి హైదరాబాద్ లోని చాలా ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.
హైదరాబాద్ నగరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని.. వాతావరణ శాఖ నిపుణులు వెల్లడించారు. ముఖ్యంగా సోమవారం రాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేశారు. మియాపూర్, నిజాంపేట్, లింగంపల్లి, టోలీచౌకి, షేక్‌పేట్, మెహదీపట్నం, ఆసిఫ్ నగర్, కూకట్‌పల్లి, మాదాపూర్, కొండాపూర్, రాజేంద్రనగర్ ఏరియాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించారు.
అటు తెలంగాణలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, నల్గొండ, నారాయణపేట, గద్వాల్, మెదక్, సంగారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి, రంగారెడ్డిలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. సోమవారం రాత్రి పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు.
ఐఎండీ హైదరాబాద్ ప్రకారం.. 24వ తేదీ.. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ్‌పేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.
25వ తేదీన.. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయి. ఈ జిల్లాల్లో వర్షాలు కురిసే సమయంలో.. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది.
26వ తేదీన.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది.

# జర్నలిస్టుల రౌండ్ టేబుల్ సమావేశం

- యూట్యూబ్స్ కు బ్రాండ్ కాస్టింగ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఇంకా లోతైన చర్చ అవసరం

**జయభేరి, హైదరాబాద్ :**




యూట్యూబ్ న్యూస్ చానల్స్ గుర్తింపు అక్రిడిటేషన్ల జారీ, తదితరాలకు, నియమ నిబంధనలు, అనుసరించాల్సిన విధివిధానాలపై, తెలంగాణ మీడియా అకాడమీ సోమవారం హోటల్ టూరిజం ప్లాజా లో చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రముఖ సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు, యూట్యూబ్ చానెల్స్ నిర్వాహకులు పలు సూచనలు చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో దాదాపు 50 మంది సీనియర్ జర్నలిస్టులు, సంపాదకులు,యూట్యూబ్ ఛానల్ ప్రతినిధులు వాటి వ్యవస్థాపకులు హాజరయ్యారు. పత్రికలకు ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్, టీవీ చానల్స్ కు మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ & బ్రాడ్కాస్టింగ్ గుర్తింపు, కంపెనీ ఆక్ట్ కింద నమోదు కావటం యూట్యూబ్ న్యూస్ చానెల్స్ కి కూడా అవసరమని అభిప్రాయపడ్డారు. న్యూస్ వెబ్సైట్లకి కూడా అలాంటి నియమనిబంధనలే ఉన్నాయన్నది గుర్తు చేశారు. యూట్యూబ్ ఛానల్స్ గుర్తింపుకు అనుసరించాల్సిన అంశాల పై ఈ కార్యక్రమంలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ విషయాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశాలు అయినందున వాటిని అమలుపర్చాల్సిన కర్తవ్యం యూట్యూబ్ చానెల్స్ పై ఉందని సమావేశం అభిప్రాయబడింది. అకాడమీ ఇలాంటి సమావేశం ఏర్పాటు చేయడం పట్ల సమావేశంలో పాల్గొన్న వాళ్ళందరూ హర్షం వెలిబుచ్చారు. ఇంకా దీనిపై నిర్దిష్ట చర్యలు జరపడానికి మరిన్ని చర్చలు జరపాలని, రౌండ్ టేబుల్ లో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ఇది మొదటిదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ అంశం పై ఇంకా లోతైన చర్చ జరగాల్సి ఉందన్నారు. భావస్వేచ్ఛకు ఉన్న పరిమితులకు లోబడి, జర్నలిజం వృత్తికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు వార్తలు, చర్చా గోష్టిలు, ఇంటర్వ్యూలు, ప్రత్యేక కథనాలు ప్రసారం చేస్తున్న యూట్యూబ్ సంస్థలను మాత్రమే మీడియా సంస్థలుగా గుర్తించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. సబ్ స్కయిబర్స్, వ్యూస్ ని ప్రధాన క్రైటేరియగా తీసుకోరాదని, ఎందుకంటే అంగట్లో సరుకుల్లాగా వాటి విక్రయం జరుగుతుందని పలువురు అభిప్రాయ పడ్డారు. వ్యక్తిగత ఎజెండాలతో, ద్వేషాలతో, కక్ష్యపూరిత ధోరణులతో, సమాజాన్ని తప్పు ద్రోవ పట్టించే వైఖరితో ప్రసారాలు చేస్తున్న వారిని పరిగణలోకి తీసుకోకపోవడం మంచిదనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. ఎలాంటి చట్టబద్ధత లేకుండా యూట్యూబ్ ప్లాట్ ఫామ్ లు సృష్టించి, హద్దు అదుపు లేకుండా చెలామణి అవుతున్న వారికి గుర్తింపు ఇవ్వడం ద్వారా మీడియా వ్యవస్థకు మచ్చ కలుగుతుందని, ఇందుకుగాను సంస్థ రిజిస్ట్రేషన్, లేబర్ లైసెన్స్, పోస్టల్ లైసెన్స్, ట్రేడ్ మార్క్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, కార్యాలయ నిర్వహణ తీరు, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించాలనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. యూట్యూబర్స్ చేస్తున్న ప్రసారాలు జర్నలిజం నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. సియాసత్ మేనేజింగ్ ఎడిటర్, ఎమ్మెల్సీ ఆమెరలి ఖాన్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే. శ్రీనివాస్ , ముఖ్యమంత్రి సి పి ఆర్ ఓ, అయోధ్య రెడ్డి, మీడియా అకాడమీ పూర్వాధ్యక్షులు అల్లం నారాయణ, ప్రముఖ జర్నలిస్టులు దిలీప్ రెడ్డి, కట్టా శేఖర్ రెడ్డి, పద్మజా షా, ఎం. ఏ. మాజీద్, కరుణాకర్ దేశాయ్, జర్నలిస్ట్ నాయకులు విరహత్ అలీ, సోమయ్య, పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.




## మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలి

- గుండ్లపోచంపల్లి మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

రాష్ట్రంలోని మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి, వాటికి నిధులు కేటాయించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో సోమవారం ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ అభివృద్ధి, సమస్యలు, చేపట్టాల్సిన పనులు, నిధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో వర్షాలు వస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వడం, డ్రైనేజీలు పొంగిపొర్లడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా వంటి అన్ని అంశాలపై ప్రభుత్వం దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలన్నారు.



**రోడ్డు కోసం వినతి...**

కొంపల్లి బ్రిడ్జి నుండి అయోధ్య చౌరస్తా మీదుగా గౌడవెల్లి రింగు రోడ్డు వరకు 100 ఫీట్ల రోడ్డు ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఉన్నంత మంది విద్యార్థులు. విద్యాసంస్థలు ఎక్కడా ఉండకపోవచ్చని, పలు రంగాల అభివృద్ధి. ప్రజల అవసరాల దృష్ట్యా రోడ్డు వెడల్పు అవసరమని అందుకు రాష్ట్ర ఆర్అండ్ మంత్రికి నివేదించి రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో పాలకవర్గం పలు అభివృద్ధి పనులు. పండగల సందర్భంగా ఏర్పాట్లకు అగు ఖర్చులు, సమీక్షలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో కమీషనర్ స్వామి. మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ ఇచ్చారు ప్లాట్లు కేటాయించడం మరిచారు

- సర్వం కోల్పోయాం సర్టిఫికెట్ ఇచ్చిన ప్లాట్లను కేటాయించలే.

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 23 :**

వర్గల్ మండల కేంద్రంలో టీజీఐఐసి లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అందించిన ఇండ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇచ్చినప్పటికీ వారికి స్థలం చూపకపోవడంతో రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. 1495,1510,సర్వే నెంబర్ లో నిర్మాణాలు చేపడుతున్న కంపెనీల ప్రతినిధులతో రైతులు మాట్లాడుతూ... ప్లాట్లు ప్యాకేజీలు పూర్తిస్థాయిలో అందించిన తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కొంతమంది భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని దానిపై రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వేలు నిర్వహించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భూములు కోల్పోయిన రైతులు పాల్గొన్నారు.

## చిల్కానగర్ డివిజన్ లో 2 కోట్ల 90 లక్షల పనుల శంకుస్థాపన

- యయంతో CRMP సిసి రోడ్డు పనుల శంకుస్థాపన
- 40 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన

**జయభేరి, ఉప్పల్ :**



చిల్కానగర్ డివిజన్లోని కళ్యాణ్పురి మెయిన్ రోడ్డు టర్నింగ్ పాయింట్ హోటల్ నుండి టీచర్స్ కాలనీ వరకు సుమారు 1.5 కిలోమీటర్ల పొడవు సుమారు 2 కోట్ల 90 లక్షల వ్యయంతో సిఆర్ఎంపి సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి. అదేవిధంగా చిల్కానగర్ గవర్నమెంట్ స్కూల్ పక్కన పాండు వీధిలో అదేవిధంగా మస్జిద్ వీధిలో నూతన సిసి రోడ్లను, ఉప్పల్ గౌడ సంఘం స్మశానవాటికలో కాంపౌండ్ వాల్, గేట్, బోరుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్లో గత మూడు సంవత్సరాల నుండి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ,ప్రజల సౌకర్యార్థం దశలవారీగా అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని చిల్కానగర్ డివిజన్లో ప్రణాళికాబద్ధంగా కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు, అదేవిధంగా ఇందిరానగర్ మర్రిచెట్టు ప్రాంతంలో బ్లైండ్ కరవ్ కూడా రోడ్డు వెడల్పు చేసి ప్రజలకు సౌకర్యార్థంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఇదే కాకుండా ప్రజల అభ్యర్థన మేరకు పలు వీధుల్లో సీవరేజ్ లైన్లు, సిసి రోడ్ల పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తానని తెలిపారు, అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ డివిజన్ ని ప్రణాళిక బద్ధంగా ముందుచూపుతో పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని అభినందించారు. టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రోత్సలంతో వారి సహకారంతో డివిజన్ ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని అభివృద్ధిలో వారి సహకారం నిధుల సేకరణలో వారు చిలుకానగర్ డివిజన్ పై ప్రత్యేక చొరవ చూపించి ఇక నగర్ డివిజన్ కి పెద్ద పీఠం వేస్తున్నందుకు వారికి మరొక్కసారి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఈ ఈ నాగేందర్, A E రాజ్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు VB నరసింహ, ఎదుల కొండల్ రెడ్డి, పల్లె నర్సింగ్ రావు, కోకుండా జగన్, పల్లె రాజ్ కుమార్, బాణాల నారాయణరెడ్డి, మాస శేఖర్, పిట్టల నరేష్, ఈరేలి రవీందర్ రెడ్డి, జల్లి మోహన్ , ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఫోటో బాలు, బాల్ రెడ్డి ,రామాంజనేయులు, పరమేష్, రమేష్ గౌడ్, బలరాం, యాదగిరి ,పోచయ్య, బాలేందర్ MD షఫీ ,MD హనీఫ్,MD గౌస్, నర్సింగ్ నేత,కుమార్, తిరుపతి, బొమ్మల శ్రీకాంత్, ప్రవీణ్, అబ్బో భాయ్, సుందర్, మహమ్మద్ ,బాబా, రాజు, మహిళ నాయకురాలు షేనాజ్, అనసూయ, కాలనీ మరియు గౌడ సంఘం అసోసియేషన్ సభ్యులు బజార్ జగన్, సూపర్ కృష్ణ,రంగ భాస్కర్ నవీన్ బింగి జగదీష్, పాండు, అల్తాఫ్, వికాస్, శివరామరాజు, రాజు యాదవ్, వివిధ పార్టీ నాయకులు దాసరి కృష్ణ, బురుగుల రమేష్, బాలచందర్, సింగ్ ఈ స్వామి యాదవ్, డాక్టర్ అశోక్, చోటే, బస్తీ వాసులు ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## హోల్ సేల్ వ్యాపారులకు న్యాయం చేయాలి

- కుషాయిగూడ హోల్ సేల్ కాంటాలకు శాశ్వత స్థలం కేటాయింపుకు చర్యలు
- కలెక్టర్ తో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి
- జడ్సీ దృష్టికి తీసుకెళ్లిన పరమేశ్వర్ రెడ్డి, బొంతు శ్రీదేవి యాదవ్

**జయభేరి, కాప్రా :**



కాప్రా సర్కిల్ లోని కుషాయిగూడ హోల్ సేల్ కాంటాలకు మరియు ఇతర వ్యాపారులకు శాశ్వత పరిష్కారం లభించనుంది. మార్కెట్ పై మూడు దశాబ్దాలుగా ఆధారపడి జీవిస్తున్న హోల్ సేల్ వ్యాపారులకు నష్టం లేకుండా ప్రత్యామ్నాయం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏకంగా సిఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగి ఇదే విషయమై జిల్లా కలెక్టర్ తో చర్చించడం జరిగింది. ప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించాలని కూడా కలెక్టర్ కూ ఆదేశించారు. ఇదే విషయంలో కూరగాయల మార్కెట్ హోల్ సేల్ వ్యాపారులు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో పరమేశ్వర్ రెడ్డి, బొంతు శ్రీదేవి యాదవ్ సమక్షంలో వ్యాపారులు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కుమార్ పాటిల్ ను కలిశారు. కూరగాయల హోల్ సేల్ వ్యాపారులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జడ్సీ త్వరలోనే సమస్యను పరిష్కరించనున్నట్టుగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హోల్సేల్ కాంట సభ్యులు పుష్పాల వెంకన్న, శ్రీనివాస్, నరేష్ కుమార్, రమేష్, నందిమ్, హరిచరణ్, రాజు రాఘవేందర్ పాల్గొన్నారు.




## 17వ డివిజన్ లో స్వచ్ఛత హీ సేవ..

- పాల్గొన్న నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**జయభేరి, మేడిపల్లి :**

స్వచ్ఛతతోటే నగరాలు పరిశుభ్రంగా ఉంటాయని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. సోమవారం స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమంలో భాగంగా నగరంలోని 17వ డివిజన్ లో పాల్గొని పరిసరాలను పరిశుభ్రవ పరిచారు.ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,స్థానిక కార్పొరేటర్ పోగుల నర్సింహ్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈస్ట్ బోడుప్పల్ కురుమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షులుగా కెమిడీ శ్రీశైలం కురుమ
- ప్రధాన కార్యదర్శి తెలంగాణ సిద్ధు కురుమ
- కోశాధికారి సంకిరి విఠల్ కురుమ



**జయభేరి, మేడిపల్లి :**

ఆదివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈస్ట్ బోడుప్పల్ కురుమ సంఘం కార్యాలయంలో కురుమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కురుమ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అధ్యక్షులు కేమిడీ శ్రీశైలం కురుమ,ప్రధాన కార్యదర్శి తెలంగాణ సిద్ధు కురుమ,కోశాధికారి సంకరి విఠల్ కురుమ,గౌరవ అధ్యక్షులు చిన్నం బీరప్ప కురుమ,ఉపాధ్యక్షులు బండ లక్ష్మయ్య కురుమ,మైల శ్రీనివాస్ కురుమ,కార్యదర్శులు భూమండ్ల నరసింహులు కురుమ,చౌదరి పల్లి పాండారి కురుమ,ముఖ్య సలహాదారులు ఆసర్ల బీరప్ప కురుమ, గౌరిగె నరసింహ కురుమ,మజ్జిగ బలరాం కురుమ,గవ్వల రవి ప్రసాద్ కురుమ, కెమిడి రమేష్ కురుమ, బండ్రు ఆంజనేయులు కురుమ,కార్యవర్గ సభ్యులు నంద చంద్రశేఖర్ కురుమ, మోటే పాండు కురుమ,ఏనుగు మహేందర్ కురుమ,గుంటి సునీల్ కురుమ,భక్కన నాగభూషణం కురుమ,కౌడే మల్లేష్ కురుమ,అల్లి కుమారస్వామి కురుమ, ఎన్నికైనట్లు పేర్కొన్నారు.సంఘం అభ్యున్నతికి పాటుపడతామని ఈసందర్భంగా నూతన కార్యవర్గం ప్రతినిధులు తెలిపారు.కురుమల కోసం ప్రభుత్వం ద్వారా పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు,సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు తీసుకుంటున్న పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్, మున్సిపల్ కమీషనర్ త్రిలేశ్వర్ రావు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ లోని పలు డివిజన్ల నుండి వచ్చిన ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుని ఫిర్యాదుల యొక్క సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ త్రిలేశ్వర్ రావు, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్ గౌడ్, మేనేజర్ సుదర్శన్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, టీపీఓ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి లడ్డు అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి

- గజ్వేల్ హైందవ సంఘాల ఐక్యవేదిక



**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 23 :**

తిరుపతి లడ్డు అపవిత్రం చేసిన వారిని వెంటనే శిక్షించాలని నిరసన వ్యక్తం చేస్తూ హైందవ సంఘాల ఐక్యవేదిక సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో శ్రీ వెంకటేశ్వర ఆలయం నుండి ఇందిరాపార్క్ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు దేవాలయాల జేఏసీ, హైందవ సోదరులు, హైందవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌరస్తా వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ లో గజ్వేల్ సిఐ సైదాకు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పురోహితులు దేశపతి రాజశేఖర శర్మ, శేషం శ్రీనివాసచార్యులు, వెంకటేశ్వర ఆలయం చైర్మన్ బుక్క రమేష్ మాట్లాడుతూ హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డు అపవిత్రం చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, తిరుమల తిరుపతి లడ్డు అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



## నాలుగు లేబర్ కోడ్ లనూ రద్దు చేయాల్సిందే

- సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

**జయభేరి, దేవరకొండ :**

సుదీర్ఘకాలం పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న హక్కులను పారిశ్రామికవేత్తలు,పరిశ్రమల యజమానుల ప్రయోజనాలు కోసమే నాలుగు లేబర్ కోడ్ లను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య అన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. గతంలో కేంద్ర ప్రభుత్వం 2019లో వేతనాల కోడ్2020లో ఐ ఆర్ కోడ్, ఓఎస్హెచ్ కోడ్, సామాజిక భద్రత కోడ్ మొత్తం నాలుగు లేబర్ కోడ్ లను బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిందని అన్నారు. అంతకుముందున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గ హక్కులను విదేశీ. స్వదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టిందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బిజిలి లింగయ్య ఎండి షేక్ ఏ క్యాబ్ వలి, మాతంగి వెంకటయ్య, పొట్ట బుచ్చయ్య, ఎర్ర వెంకటయ్య, అంకురి నరసింహ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నీలా స్ జోన్ సోషల్ ఆలంపల్లి స్ జోన్ సోషల్



**జయభేరి, హాలియా :**

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ V 104A రిజన్ XI జోన్ II, జోన్ III వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో వైభవ్ ఫంక్షన్ హాల్ హాలియా లో నీలా స్ జోన్ సోషల్ ఆలంపల్లి స్ జోన్ సోషల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి KCGF VN వాసవి దత్త, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బెలిదే మాధవి రవీందర్ చీఫ్ గెస్ట్ గా విచ్చేసి వారు మాట్లాడుతూ.. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ లో సభ్యత్వం తీసుకొని వాసవి మాత సాక్షిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ అధ్యక్షులు కార్యదర్శి కోశాధికారు లను ఆమె ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్లు ఆలంపల్లి పద్మ నీల సంజీవ కుమార్ డిస్టిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లకుమారపు మల్లయ్య డిస్టిక్ ప్రోగ్రాం ఇన్చార్జ్ అర్థం రమేష్ రీజినల్ చైర్మన్ కొండూరు శోభన్ బాబు వాసవి క్లబ్ అధ్యక్షులు నీలా భిక్షమయ్య కార్యదర్శి అతుకురి ఆంజనేయులు కోశాధికారి కండె సత్యం వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ అధ్యక్షురాలు తొనుకునూరి విజయ, కార్యదర్శి మంచికంటి పద్మ కోశాధికారి కుంచకూరి శిరీష తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత మెగా వైద్య శిబిరం

**జయభేరి, పీఏపల్లి :**

అజ్మాపురం గ్రామంలో యశోద హాస్పిటల్, మలక్ పేట హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు వస్కుల ముత్యాలు జ్ఞాపకార్థంతో మనవరాలు ధృతి మహిశ్రీ జన్మదిన సందర్భంగా వస్కుల రోహిణమ్మ ఆర్థిక సాయంతో పీఏపల్లి మండలంలోని అజ్మా పురం గ్రామంలో ఈనెల 25న బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు దేవరకొండ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసే ఉచిత మెగా వైద్య శిబిరంలో గుండె వైద్య నిపుణులు జనరల్ ఫిజీషియన్ స్త్రీ వ్యాధి నిపుణులు ఆర్థోపెటిక్ వైద్య నిపుణులు కంటి వైద్య నిపుణులతో పాటు బీపీ ఈసీజీ 2d ఈ సి జి ఓ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. పరిసర గ్రామ ప్రజలు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## పెండింగ్ డీఏలను పి ఆర్సి నీ వెంటనే ప్రకటించాలి



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలంలో పలు ఉన్నత పాఠశాలలో గురుకుల పాఠశాలల్లో TSUTF సభ్యత్వ నమోదు కార్యక్రమం దేవరకొండ మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా TSUTF జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను అలాగే పిఆర్సిని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంకురి సతీష్ జి చిన్న ముత్యాలు తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు జిల్లా కార్యదర్శి తావూర్యా, గోవర్ధన్ రావు, శ్రీను , పొట్ట రాములు ఇద్దయ్య, గంటేల వెంకట్ రవీందర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా.. పేద విద్యార్థుల బతుకులు మారవా...

- విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్

**జయభేరి, దేవరకొండ :**




భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష సోమవారం దేవరకొండ బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్ ప్రజాతంత్ర బాధ్యులు నల్ల వెంకటయ్య ఈ దీక్షలో కూర్చున్న సభ్యులకు పూలమాలలు వేసి ప్రారంభిచి అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్నట్టుగా రాష్ట్రంలో 540 గురుకులాలు ఉంటే ఆ గురుకులాల సమస్యలను పట్టించుకునే నాధుడే కరువయ్యారనిన్నారు. స్కాలర్షిప్ , ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడి చదువుకునే విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉంటే పై చదువులు ఎలా సాధ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా సంక్షేమ వసతి గృహాలలో ఉన్నటువంటి బడుగు బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులకు 33 రూపాయల అరవై పైసలు తోటి మూడు పూటల భోజనం పెట్టడం ద్వారా పౌష్టికాహారం ఎలా సాధ్యమవుతుంది న్నారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా మేస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు కూడా కొత్త ప్రభుత్వం లో విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం చాలా దుర్మార్గమైన విషయమని తక్షణమే విద్యాశాఖ నియమించాలని అన్నారు, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ విద్యారంగా సమస్యలు పరిష్కారానికి చేసే ఈ దీక్ష ఇంతటితో ఆగదని,ఈనెల 27 న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులను ఐక్యం చేసి చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు ,పొట్ల రాకేష్,జిల్లెల్ల ఇద్ది రాములు,నెర్లపల్లి జైచరణ్,గోలి శివ,ఉంగరాలు శివయ్య, నేలపల్లి భాను,కావ్య,నందిని,మంజుల, మహేశ్వరి,రామావత్ చరణ్ తేజ్, మనోహర్,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద యువకునికి ఆసుపత్రి వైద్య ఖర్చులు

- 10 000/- ఆర్థిక సహాయం

**జయభేరి, దేవరకొండ :**



నిరుపేద యువకునికి ఆసుపత్రి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం. స్థానిక ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మన్నెగూడ మహోనియా ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న పులిజాల శంకర్ కు వైద్య ఖర్చుల కొరకు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 10,000/ రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. దేవరకొండ నియోజకవర్గానికి చెందిన నిరుపేద పులిజాల శంకర్ వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రమాదానికి గురై తీవ్ర అనారోగ్యం చెందగా, మెరుగైన వైద్య చికిత్స కోసం రంగారెడ్డి జిల్లా, మన్నెగూడలోని మహోనియా ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు, ఆసుపత్రి ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని నల్గొండ జిల్లా ఎన్సీపీ నాయకులు ఇడెం అరుణ్ కుమార్ తెలుసుకొని ఎన్సీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ చేతుల మీదుగా 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గోలివాడ ప్రసన్న కుమార్ గంగపుత్ర మాట్లాడుతూ పులిజాల శంకర్ ప్రమాదం జరిగి అనారోగ్యం పాలయ్యాడని, వైద్య చికిత్సకు డబ్బులకు ఇబ్బందులు పడుతున్నాడని తెలుసుకొని ఎన్సీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ పులిజాల శంకర్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేయడం జరిగిందని" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సీపీ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గోలివాడ ప్రసన్న కుమార్ గంగపుత్ర, ఎన్సీపీ నాయకులు ఇడెం అరుణ్ కుమార్, చెన్నూరి నాగరాజు, తాటిపెల్లి ప్రవీణ్ కుమార్, రవితేజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## పార్కు స్థలాన్ని కాపాడండి..!

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఒకటో వార్డు సాయి నగర్ కాలనీ సర్వే నెంబరు 30 లో ఉన్న పార్కు స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడాలని దీంతోపాటు డివిజన్లో ఉన్న అన్ని పార్కులకు ఫెన్సింగ్ వేయాలని ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర రావు మేయర్ అమర్ సింగ్ గారికి పీఎంసి కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఒకటో వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఎండి మజార్ వినతి పత్రం అందజేశారు..

## స్వచ్ఛత హి సేవా 2024 కార్యక్రమం

- కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి.




**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం. స్వచ్ఛ కార్పొరేషనే లక్ష్యంగా స్వచ్ఛత ఈ సేవ 2024 కార్యక్రమాన్ని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు స్వచ్ఛ ప్రతిజ్ఞ, స్వచ్ఛ ర్యాలీ, మానవహారం, ఇంటింటికి స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, అర్పి కవిత SHGs, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు పెంచాలి

**జయభేరి, దేవరకొండ :**




గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని దేవరకొండ మండలంలోని పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల గత నాలుగు ఐదు నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని దేవరకొండ మండల ఎంపీడీవో కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలు ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి పాల్గొని మాట్లాడుతూ దేవరకొండ మండలం గ్రామపంచాయతీ కార్మికుల గత నాలుగైదు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి కార్మికులుగా కనీస వేతనం నెలకు 26 వేల జీతం ఇవ్వాలన్నారు.పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని,సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్, సబ్బులు, బ్లౌజులు, ఇవ్వాలని గ్రామాలలో చెత్త మోరీలు శుభ్రం చేస్తున్నందున కార్మికులకు అనారోగ్యానికి గురవుతున్న కార్మికులకు ఈఎస్ఐ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే వారికీ ఉద్యోగ భద్రత కల్పించి,దసరా దీపావళి, పండుగ సందర్భంగా ఒక నెల జీతం బోనస్ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వము ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జూలూరి వెంకట రాములు,మండల కార్యదర్శి అలముని మల్లయ్య, గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండలం కార్యదర్శి జిల్లా వీరయ్య, వలబోతు నరసింహ, బొడ్డుపల్లి అయోధ్య, రేపాని ఇద్దయ్య, వీరయ్య, నాగరాజు, సైదులు, బుచ్చయ్య రవి తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు మేలు చేయాలని సిఎంని కోరిన గూడూరు

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 23:**



రాష్ట్రంలోని పాల ఉత్పత్తిదారులకు తక్షణమే మేలు చేయాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి సోమవారం ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని కోరారు. ప్రభుత్వ యాజమాన్యంలోని డెయిరీ కంపెనీలు గత మూడు నెలలుగా కొనుగోలు చేసిన పాలకు ఖర్చులు చెల్లించకపోవడంతో పాల ఉత్పత్తిదారులు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని మీడియా ప్రకటనలో తెలిపారు. పాడి పరిశ్రమలో నిమగ్నమైన రైతులు తమ పశువులను పోషించలేక వాటిని కబేళాలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. రైతులు పశు గ్రాసాన్ని కొనుగోలు చేయలేక గేదెలు, ఆవులు ఆకలి కి అల్లాడిపోయాయి అని తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న డెయిరీ డెవలప్‌మెంట్ కంపెనీ విజయ డెయిరీ ప్రతి పదిహేను రోజులకోసారి రైతులకు ఖర్చులను సత్వరమే చెల్లించేదని శ్రీ రెడ్డి తెలిపారు. అయితే కంపెనీకి బాగా తెలిసిన కారణాల వల్ల గత మూడు నెలలుగా వారికి బిల్లులు అందడం లేదు. రుణమాఫీ పథకం రైతులకు చేరకపోవడంతో చాలా మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే సమయంలో ప్రభుత్వం వారికి రైతు భరోసా మొత్తాలను చెల్లించడం లేదు. ఇవి వారి కార్యకలాపాలను కొనసాగించడానికి ఆర్థిక సామర్థ్యాలను కోల్పోయాయి. "రైతులు మూడు నెలలుగా ఖర్చుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు డబ్బులు వస్తాయన్న ఆశలన్నీ వదులుకుంటున్నారు. ఆవులు, గేదెలను కబేళాలకు విక్రయించడం తప్ప మరో మార్గం లేని పరిస్థితికి చేరుకుంది" అని వాపోయాడు. ముఖ్యమంత్రి పశుసంవర్ధక శాఖను చూస్తున్నందున, పరిస్థితిని గమనించి చెల్లింపులు జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని బిజెపి నాయకుడు అన్నారు. రాజకీయాలు చేయడానికి ఇది సమయం కాదని, ప్రజలకు చేస్తున్న వాగ్దానాలను నెరవేర్చే సమయం ఆసన్నమైందన్నారు. భాజపా ప్రభుత్వానికి ఇప్పటి వరకు పెద్దపీట వేసిందని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చకపోయినప్పటికీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాలేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు హామీల్లో మూడింటిని మాత్రమే నిలబెట్టుకుంది. ప్రభుత్వం సీరియస్‌గా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకుండా, హెడ్‌లైన్స్‌కు హాష్‌ట్యాగ్ చేయడంపై ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని విమర్శించారు. మీడియా నిర్వహణపై మాత్రమే ఆసక్తి చూపిన మునుపటి BRS ప్రభుత్వం అడుగుజాడల్లో ఇది నడుస్తోంది తీవ్రంగా దుయ్యబట్టారు.




# స్త్రీ-3 కోసం ఎదురు చూస్తున్నా..



"స్త్రీ2' నా కెరీర్‌కి ఊహించని వరం. ఈ స్థాయి విజయాన్ని నేనెన్నడూ ఊహించలేదు. ఖాన్ సినిమాలకు వచ్చే కలెక్షన్లు కథానాయిక నేపథ్య చిత్రానికి రావడం నిజంగా ఆశ్చర్యం. ప్రస్తుతానికి దేశంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆరోస్థానంలో 'స్త్రీ2' ఉంది. ఇంకా వసూళ్లు బాగానే ఉన్నాయని, ఈ లెక్కలు కూడా మారే ఛాన్సుందని చెబుతున్నారు.' అంటూ ఆనందం వెలిబుచ్చింది శ్రద్ధా కపూర్. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం "స్త్రీ 2'. 2018లో వచ్చిన హిట్ సినిమా 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్. రాజ్‌కుమార్‌రావ్ కీలకపాత్ర పోషించిన ఈ సినిమాకు అమర్ కౌశిక్ దర్శకుడు. ఆగస్ట్ 15న విడుదలైన ఈ సినిమా 39రోజుల్లో 604కోట్ల షేర్, 713కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించింది. తాజా ఇంటర్వ్యూలో ఈ విజయం గురించి శ్రద్ధా ఆసక్తికరంగా మాట్లాడింది. 'పెద్ద స్టార్లు లేకపోయినా కథను ఆసక్తికరంగా చెబితే జనం ఆదరిస్తారని 'స్త్రీ 2'తో రుజువైంది. ఈ ఫ్రాంచైజీ కొనసాగుతూనే ఉండాలని కోరుకుంటున్నా. 'స్త్రీ 3'కోసం నేనూ ఈగర్లీ ఎదురు చూస్తున్నా.' అని చెప్పుకొచ్చింది శ్రద్ధా.

# ప్రియాంకా జవాల్కర్.. ఇంతకీ ఎక్కడికెళ్లిందో తెలుసా..?

టాక్సీవాలా సినిమాతో తెలుగు ఫిలిం ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది ప్రియాంకా జవాల్కర్. 2018లో విజయ్‌దేవరకొండతో కలిసి నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా.. ప్రియాంకా జవాల్కర్‌కు మాత్రం మంచి ఫ్యాన్ బేస్ సంపాదించి పెట్టింది. ఆ తర్వాత ఎస్ఆర్ కల్యాణ మండపం సినిమాతో మంచి బ్రేక్ అందుకుంది. 2024లో టిల్లు 2తో మెరిసిన ఈ బ్యూటీ కొత్త సినిమా ప్రకటించాల్సి ఉంది. ఈ భామ ప్రస్తుతం స్టైలిష్‌గా ప్రెట్టీ ఉమెన్ అవతార్‌లోకి మారిపోయిన లుక్స్ నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. ఇంతకీ ఈ బ్యూటీ ఎక్కడికెళ్లిందనే కదా మీ డౌటు. పాపులర్ సిటీ న్యూయార్క్. ఎడ్వర్డ్ : యువరాణి ఓ గుర్రం ద్వారా రక్షించబడిన తర్వాత ఏమి జరుగుతుంది? వివియన్ : ఆమె వెంటనే అతన్ని రక్షించింది! ప్రెట్టీ ఉమెన్ సినిమా నుండి.. మీరు చూశారా? అంటూ క్యాప్షన్ ఇచ్చింది ప్రియాంకా జవాల్కర్.





# అభిషేక్ ఐశ్వర్య విడాకులు ఒట్టి రూమర్స్..

అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్యారాయ్ విడాకులు తీసుకోబోతున్నారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంపై ఎప్పుడూ నేరుగా స్పందించకపోయినా పలు వేడుకలకు కలిసి హాజరవుతూ పరోక్షంగా క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసింది బచ్చన్ ఫ్యామిలీ. అయినా వదంతులు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో వెడ్డింగ్ రింగ్ ధరించి వాటికి మరో చెక్ పెట్టారు ఐశ్వర్యారాయ్. అట్టహాసంగా జరుగుతున్న 'పారిస్ ఫ్యాషన్ వీక్' కు కుమార్తె ఆరాధ్యతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో పాల్గొనే ముందు ఐశ్వర్యారాయ్ కెమెరాకు పోజులిచ్చారు. సంబంధిత వీడియో బయటకు వచ్చింది. వివాహ సమయంలో అభిషేక్ బచ్చన్ ఇచ్చిన ఉంగరాన్ని ధరించి ఐశ్వర్య ఫ్యాషన్ వీక్‌కు హాజరయ్యారంటూ బాలీవుడ్ మీడియా పేర్కొన్నది. దాంతో విడాకుల రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టినట్టయ్యింది. అమితాబ్ బచ్చన్ ఎక్స్‌లో గత ఏడాది 'అంతా అయిపోయింది' అని అర్థం వచ్చేలా ఒక పోస్ట్ పెట్టారు. దాన్ని కొందరు తన కుమారుడు, కోడలు దాంపత్య జీవితానికి ఆపాదించారు. మరోవైపు ఐశ్వర్యారాయ్ సోషల్ మీడియా ఖాతాను అమితాబ్ అన్‌ఫాలో చేశారంటూ బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. దాంతో విడాకుల వదంతులు మొదలయ్యాయి. కొంతకాలంపాటు ఆ పుకార్లు షికార్లు చేశాయి. ముంబైలోని అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షిక వేడుకలో అమితాబ్, అభిషేక్, ఐశ్వర్య సందడి చేయడంతో వాటికి తెరపడింది.

# మంచి స్ట్రెస్ బస్టర్

అయిదేళ్ల క్రితం వచ్చి విజయం సాధించిన 'మత్తువదలరా' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మత్తు వదలరా 2'. శ్రీసింహా కోడూరి, సత్య, ఫారియా అబ్దుల్లా లీడ్ రోల్స్ చేసిన ఈ చిత్రానికి రితేష్ రానా దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటైర్టైన్మెంట్స్ పతాకంపై చిరంజీవి (చెర్రి), హేమలత పెదమల్లు నిర్మించిన ఈచిత్రం ఈ నెల 13న విడుదలై థియేటర్లలో ప్రదర్శింపబడుతున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన థ్యాంక్స్‌మీట్‌లో హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'మా సినిమాను అనుకున్నదానికంటే పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. పార్ట్ 3 కోసం మీలాగే నేనూ ఎదురుచూస్తున్నా.' అన్నారు. ఈ సినిమాను ఒక మంచి స్ట్రెస్ బస్టర్ అని చాలామంది అంటున్నారని నిర్మాత తెలిపారు. 'ప్రపంచవ్యాప్తంగా 30కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిందీ సినిమా. దసరా సెలవల్లోనూ ఈ రన్ కంటిన్యూ అవుతుందని నమ్ముతున్నాం. ఇదే ఉత్సాహంతో 'మత్తువదలరా 3' బ్రహ్మాండంగా చేస్తాం' అని నిర్మాత వై.రవిశంకర్ తెలిపారు.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com